నేటి దినపత్రిక
# సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 16 జులై 2024 | పేజీలు 8

## ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

**అదనపు కమిషనర్ శర్మద**



లోపల పేజీలో

## విద్యార్థులలో నిర్మాణాత్మక అభ్యసన జరగాలి




**అనంత సాగరం, మేజర్‌న్యూస్ :** అనంత సాగరం మండలంలోని పాతాళపల్లి, గోవిందంపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులకు అదనపు అభ్యాసనకు దోహదపడే వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. పని కృత్యాలకు ఇచ్చిన అభ్యాసాలలో విద్యార్థులు చేసే తప్పిదాలను ఉపాధ్యాయులు సవరించాలని, మెరుగైన పాఠ్యప్రణాళికలను రూపొందించి విద్యార్థులలో విద్యాపర నిర్మాణ స్థాయిలు ఏర్పడేలా బోధన ఉండాలని సూచించారు. గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన ఏర్పాటను పరిశీలించారు.

### బాధ్యతలు స్వీకరించిన

## జిల్లా ఎస్పీ కృష్ణకాంత్



- గంజాయి ముఠాపై ప్రత్యేక నిఘా !
- శాంతి భద్రతలే లక్ష్యం..
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించుతానని నూతన జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు.

2 లో

### ఆక్రమణల పట్ల

## స్పందించిన అధికారులు

**నిర్మాణాల కూల్చివేత - 'సూర్య' ప్రభావం**



2 లో



## అంగన్‌వడీ భవన నిర్మాణాలకు మోక్షం లేదా!

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

**ఆత్మకూరులో నిధుల కొరత అని, ఇతరత్రా కారణాలని అనేక భవనాలు నిర్మా ణాలు అర్థాంతరంగా నిలిచిపోయి దర్శనమిస్తుండడం, పూర్తియిన భవనాలు వివద కారణాలతో వినియోగంలో లేకుండా నిరుపయోగంగా దర్శ నమిస్తుండడం అనాదిగా ఆనవాయితీగా ఉంది. మండలంలోని నువ్వురుపాడు అరుంద తీయ కాలనీలో గత మూడేళ్లుగా ముళ్ళచెట్ల మధ్య ఒక అర్థాంతర నిర్మాణ భవనం కన్పిస్తుంటుంది. అది అంగన్‌వాడీ భవనమని, శ్లాబ్ లెవల్ వరకు నిర్మించి వదిలేశారని కాలనీ వాసులు తెలిపారు.**

నువ్వురుపాడు, మహిమలూరు, అప్పారావు పాళెం, నాగులపాడు,చెర్లోయడవల్లి, సాతాను పల్లి, శ్రీనివాసపురం, పమిడిపాడుల్లో కూడా అదే మాదిరిగా భవనాల నిర్మాణాలు నిలిచిపోయి ఉన్నాయని ఆయా గ్రామాల వారు చెబుతుం డేవారు. అప్ప ట్లో ఒక్కో భవనానికి రూ. 7లక్షల వంతున మంజూరు కాగా, శ్లాబ్‌లెవల్ వరకు నిర్మించి వదిలేశారని చెబుతుండేవారు. ఆత్మకూరులో పలు భవనాల పరిస్థితి చూస్తే అత్యంత విడ్డూరంగా, విచిత్రంగా ఉంటుంది. 9 ఏళ్లుగా ఆర్ అండ్‌బి అతిథి గృహం భవనం, ఐదేళ్ళుగా ఆర్డీవో, తహశిల్దారు కార్యాలయాలభవనాల నిర్మాణాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. సాతానుపల్లి వద్ద నిర్మించిన పాఠశాల భవనం, కమ్యునిటి హాల్ నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. మహిమ లూరులో డ్వాక్రా భవనం 12 ఏళ్లుగా శ్లాబ్‌లెవల్‌లో దర్శిన మిస్తోంది. ఈ విషయమై అధికారులతో 'మేజర్ న్యూస్' మాట్లాడగా.. ప్రాజెక్ట్ పరిధిలో దాదాపు 20 భవనాలు ఇలాగే ఉన్నాయని, నిధులు కొరతతో పనులు నిలిపివేవామని తెలుపగా తమవంతుగా ఏయి ద్వారా ఏయే భవనానికి ఎంత నిధులు అవసరమో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, ఇంకా నిధులు మంజూరు కాలేదని వారు పేర్కొన్నారు. మరి జిల్లా అధికారులు స్పందించి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటారేమో చూడాల్సి ఉంది.

### టీడీపీ ప్రభుత్వం..

## మళ్లీ మోసం చేయాలని చూస్తోంది

- టీడీపీ ప్రభుత్వం మళ్లీ మోసం చేయాలని చూస్తోంది
- అదే జరిగితే ప్రజల పక్షాన నిలబడి వైసీపీ పోరాటం చేస్తుంది
- వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తోందని వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లా వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డి, హంజా హుస్సేనీ, పెర్నీటి కోటేశ్వర్ రెడ్డితో కలిసి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లికి వందనం పేరుతో ఇంట్లో 2లో

## చరిత్రలో నిలిచేలా.. రొట్టెల పండుగ

**అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి : మంత్రి డా. నారాయణ**

- దర్గా ఆవరణలో పరిశుభ్రతకు ప్రాధాన్యత
- దర్గాలో 95 శాతం మేర ఏర్పాట్లు పూర్తి
- భక్తులకు నిరంతరం తాగునీరు
- విరివిగా మరుగుదొడ్లు ఏర్పాటు
- పరిశుభ్రతకు పెద్దపీట
- 7 జోన్లుగా పారిశుద్ధ్య పనులు
- 2 వేల మంది పోలీసులతో బందోబస్తు
- స్వర్ణాల చెరువులో గజ ఈతగాళ్లు, బోట్లతో గస్తీ



**చరిత్రలో నిలిచేలా ప్రపంచ ప్రసిద్ధి చెందిన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు.**

-వివరాలు 2లో

# చరిత్రలో నిలిచేలా.. రొట్టెల పండుగ

## అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి : మంత్రి డా. నారాయణ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** చరిత్రలో నిలిచేలా ప్రపంచ ప్రసిద్ధి చెందిన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను రాష్ట్ర పుర పాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రొట్టెల పండుగ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మంత్రి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19లో తాను మంత్రిగా దర్గాలో శాశ్వత మరుగుదొడ్లు, సిమెంటు రోడ్లు, ఘాట్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, రొట్టెల పండుగలో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామన్నారు. అదేవిధంగా ఇప్పుడు కూడా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పార్కింగ్ ప్రదేశాల్లో కూడా తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాఖలవారీగా సమీక్షించారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, వైద్యారోగ్యశాఖ, మత్స్యశాఖ, అగ్నిమాపక తదితర శాఖలవారీగా చేపట్టిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణకు సుమారు 5వేల మందిని ప్రైవేటుగా నియమిస్తున్నామని, పార్కింగ్ ప్రదేశాల్లో టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామని, 12 తాగునీటి స్టాల్స్ ఏర్పాటుచేసి నిరంతరం భక్తులకు స్వచ్ఛమైన నీటిని అందించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 2వేల మందితో పటిష్ట పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు మంత్రికి వివరించారు. ఘాట్ల వద్ద నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు అగ్నిమాపకశాఖ ద్వారా 10 పంపుల ద్వారా వాటర్‌ను పంపింగ్ చేయనున్నట్లు చెప్పారు. 45 మంది గజ ఈతగాళ్ళు, రెండు బోట్లలో గస్తీ ఏర్పాటు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలకు నిరంతరం బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం తెలిపారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ స్టాల్స్, 57 రకాల మందులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. స్పెషలిస్టు వైద్యులను కూడా వైద్య శిబిరాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ తెలిపారు. రొట్టెల పండుగ వచ్చే భక్తులందరూ సంతృప్తి చెందేలా అధికారులందరూ పనిచేయాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



అనంతరం మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీ నుంచి సుమారు వారం రోజుల పాటు రొట్టెల పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ఈ పండుగకు ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 20 లక్షల మందికి పైగా బారాషహీద్ దర్గా సందర్శనకు విచ్చేస్తారని చెప్పారు. కులమతాలకతీతంగా అందరూ విచ్చేసి స్వర్ణాల చెరువులో కోరిన కోర్కెలు తీరేందుకు రొట్టెలు పట్టుకోవడం, తర్వాత సంవత్సరంలో వచ్చి కోర్కె తీరిన అనంతరం మళ్లీ రొట్టెలు వదలడం గత 400 సంవత్సరాలకుపైగా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతుందన్నారు. ఏడాదికేడాది భక్తుల సంఖ్య పెరుగుతుండంటే.. అది బారాషహీద్ దర్గా పట్ల భక్తులకున్న ప్రగాఢ విశ్వాసమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ నిర్వహణపై అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సంపూర్ణ చర్యలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య శిబిరాలు, ఎలక్ట్రిసిటీ, ఫైర్ అధికారుల పర్యవేక్షణ, దివ్యాంగులకు సౌలభ్యంగా ఏర్పాట్లు, స్వచ్ఛంధసంస్థల వారు భోజనాలు ఏర్పాటు చేస్తే వారికి వసతుల కల్పన, తదితర అంశాలపై కలెక్టర్‌తో పాటు అన్నీ శాఖల అధికారులతో మాట్లాడినట్లు మంత్రి నారాయణ తెలిపారు. బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు సంబంధించి 95 శాతం మేర పనులన్నీ పూర్తయ్యాయని, మిగిలిన 5 శాతం కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఏఎస్పీలు సౌజన్య, గాదె శ్రీనివాసరావు, శ్రీనివాసులు, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ దేవీకుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, మున్సిపల్ ఎస్ఈ సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, మత్స్యశాఖ ఎస్ఈ నాగేశ్వరరావు, డిపివో సుస్మిత, ఆర్డీవో మలోల, తహశీల్దార్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రభుత్వం మళ్లీ మోసం చేయాలని చూస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

ఎంత మంది పిల్లలుంటే అంతమందికి 15 వేల రూపాయలు చొప్పున ఇస్తానని చెప్పిన చంద్రబాబు.. నేడు యూటర్న్ తీసుకున్నారు. ఇటీవల పాఠశాల విద్య అధికారులు విడుదల చేసిన జీవో నెంబర్ 95లో పిల్లలను స్కూలుకు పంపిన ప్రతి తల్లికి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ప్రెస్‌మీట్‌లు పెట్టించి పోరాటానికి దిగడంతో చంద్రబాబు వెనక్కి తగ్గాడని తెలిపారు. ఇది పేద ప్రజల పక్షాన ప్రతిపక్షంలోనూ జగన్ మోహన్ రెడ్డి విజయమన్నారు. అమ్మ ఒడి పథకంపై షర్మిలమ్మ కామెంట్స్ సరికాదన్నారు. ఒకసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చూసుకోవాలని షర్మిలకి హితవు పలికారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై గత ప్రభుత్వం పోలీస్ కస్టడీకి తీసుకోవడంపై.. తెలుగుదేశం పార్టీ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిపై, ప్రభుత్వం 307 కేసు బనాయించడం దారుణమన్నారు. పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న రఘురామ కృష్ణంరాజును గతంలో పోలీసులు అరెస్టు చేస్తే ఆ విషయంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై నేడు 307 కేసులు నమోదు చేయడం రాజకీయ కక్షేనన్నారు. రెండేళ్ల క్రితమే రఘురామ కృష్ణంరాజు ఈ విషయంపై సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ సుప్రీం కోర్టు ఈ కేసును కొట్టి వేసిందన్నారు. అలాంటిది పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనకు సంబంధించి నేరుగా నాటి ముఖ్యమంత్రి మీద ఏకంగా 307 కేసు పెట్టడం దేశంలో ఎక్కడా జరగదు, జరగలేదని అన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ కూటమి... ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి జిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను తెస్తామని హామీ ఇచ్చింది. అలాంటి ప్రక్రియ చేపట్టకుండా.. తిరిగి జిపిఎస్‌ను అమలు చేసే విధంగా జీవో విడుదల చేయడం ఉద్యోగాలను మోసం చేయడమేనన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజలను ప్రతి విషయంలోనూ మోసం చేయాలని చూస్తుందన్నారు. ఇసుక ఉచితం అని చెప్పిన తెలుగుదేశం పార్టీ నేడు ట్రాక్టర్‌కు 3500 రూపాయలు వసూలు చేస్తూ.. అరకొర గా నింపుతూ ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రజలను మోసం చేయాలని చూస్తే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీగా పోరాటం చేస్తుందన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు నూతన జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐపిఎస్ బదిలీల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నెల్లూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణకాంత్ మాట్లాడుతూ.. కర్నూల్ నుండి నెల్లూరు జిల్లాకు ఎస్పీగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల గంజాయి నిర్మూలన విధానంలో భాగంగా జిల్లాలోని పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపకల్పన చేస్తామన్నారు. మహిళలపై జరిగే నేర నిర్మూలన, మహిళా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టిసారించి కార్యాచరణ రూపకల్పన చేస్తామన్నామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పు అని, సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా పెడుతామన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటు ప్రజల సహకారంతో వారి ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించి.. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తామన్నారు. పోలీసులు, వారి కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు, మీడియా మిత్రుల స్నేహపూర్వక సహకారం ఎంతో అవసరం.. సమన్వయంతో ముందుకెల్దామన్నారు. అనంతరం సబ్ డివిజన్, సర్కిల్ పోలీసు అధికారులు, యస్‌బి, డీసీఆర్‌బీ, పోలీసు కార్యాలయ సిబ్బంది, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆక్రమణల పట్ల స్పందించిన అధికారులు నిర్మాణాల కూల్చివేత

### 'సూర్య' ప్రభావం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఆక్రమణల పట్ల మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం శాంతినగర్ వద్ద నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేశారు. శాంతినగర్ వద్ద ఆక్రమణల జోరు పెరిగిందని, మున్సిపల్, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకొని నిర్మాణాలు ప్రారంభించడం, విక్రయించడం జరుగుతుందని 'సూర్య' దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు స్పందించారు. జేసీబీలు ఏర్పాటు చేసి నిర్మాణం లోని గోడలు, పునాదులు తొలగించారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. అధికారులను అభినందిస్తున్నారు. అయితే నిర్మాణాలు పూర్తయిన ఆక్రమణలు తొలగించే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి.. తస్మాత్ జాగ్రత్త..

▶ సీపీఎం పొలిట్ బ్యూరోసభ్యులు బీవీ రాఘవులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, జనసేనలు బీజేపీతో జతకట్టడం సరికాదు.. బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి వాళ్లతో చేరిన వాళ్ళు దెబ్బ తింటారని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు తెలియజేశారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఆంధ్రాలో వైసీపీ, తెలంగాణలో బిఆర్ఎస్‌లు ఇదేవిధంగా దెబ్బతిన్నాయి. ఇప్పుడైనా టీడీపీ, జనసేన పార్టీలు మేలుకోవాలని, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీజేపీతో స్నేహం చేసిన ప్రాంతీయ పార్టీల పరిస్థితిని ఎలా ఉందో చూస్తున్నామని మహారాష్ట్రలో శివసేనను శరత్ పవర్ నేతృతంలోని ఎన్‌సీపీని ఏ విధంగా చీల్చారో అందరికీ తెలిసిందే. అదేవిధంగా రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది పోలవరం, శ్రీకాకుళంలోని జంఝా వతి వంటి ప్రాజెక్టుల పనులు ఇంకా పూర్తి కాలేదు. ఒరిస్సాతో ఉన్న వివాదాలను కూడా గత ప్రభుత్వం పరిష్కరించలేకపోయింది. ఇప్పుడు అక్కడ బీజేపీ ప్రభుత్వమే ఉంది. మన రాష్ట్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వమే ఉంది. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని కాంట్రాక్టర్‌ను జగన్ మార్చేశారు. వెలుగొండ ప్రాజెక్టు పనులు కూడా పూర్తి కాలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టుల వారి శ్వేతపత్రాన్ని విడుదల చేసి ప్రాజెక్టుల పురోగతిలో ఆలస్యాన్ని గుర్తించి వాటికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అమరావతిలో రాజధాని మూడేళ్లు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారని, గత ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్ చేశారని, అదే పొరపాట్లు పునరావృతం కాకుండా చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే కాలంలో ఎవరు అధికారంలోకి వచ్చినా రాజధానులను మార్చేందుకు వీలు లేకుండా పకడ్బందీ చట్టాన్ని తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

▣ అదనపు కమిషనర్ శర్మద



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ శర్మద పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మౌలిక సదుపాయాల కల్పన, స్థలాలు, కాలువలపైన ఆక్రమణలు, టిడ్కో గృహాల్లో మౌళిక సదుపాయాల కల్పన, పూర్తయిన గృహాల కేటాయింపులు, కచ్చా కాలువలు, డ్రైనేజీ సౌకర్యాలు, మంచినీటి కల్వర్టులు, నూతన రోడ్ల నిర్మాణం, ప్యాచ్ వర్క్ పనులు వంటి అంశాలపై ప్రజల నుంచి అందుకున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, అండర్ బ్రిడ్జిలలో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని సూచించారు. అదే విధంగా విభాగాల వారీగా ఇంజనీరింగ్-5, టౌన్ ప్లానింగ్-4, హౌస్ ఫర్ ఆల్-3, ఆప్కాస్-2, పబ్లిక్ హెల్త్-1, పెన్షన్-2, మొత్తం 17 వినతులను పిఆర్‌జిఎస్‌లో అందుకున్నారు. పెండింగులో ఉన్న ఫిర్యాదుల స్థితిగతులపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్ఈ సంపత్ కుమార్, సిటీ ప్లానర్ దేవీ కుమారీ, మేనేజర్ ఇనాయతుల్లా ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు బహూకరణ

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహూకరణ చేశారు ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు, కే.దొరస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచిన వి.యశితకు ఠాగూర్ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి ఉన్నత స్థానంలో ఉన్న అనుమసముద్రం గ్రామానికి చెందిన పొనుగోటి మనోహర్ రెడ్డి కుమారులు మధుసూదన్ రెడ్డి, మహేష్ రెడ్డిలు ప్రతి సంవత్సరం పాఠశాల ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ.10వేలు నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుంది. ఈ మేరకు 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన వి.యశితకు





రూ.10వేలు నగదు బహుమతి మెడల్, షీల్డ్‌ను వారి చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఠాగూర్ పాఠశాలలో అనేక సంవత్సరాలు ఇంగ్లీషు ఉపాధ్యాయులుగా పనిచేసి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్ది పాఠశాల మీద ఉన్న మమకారం విద్యార్థుల మీద ఉన్నటువంటి అభిమానంతో ఉపాధ్యాయుడు నాగభూషణం వారి సతీమణి అయినటువంటి సత్యవతమ్మ జ్ఞాపకార్థంగా ఠాగూర్ పాఠశాలలో కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో అపస్మా నిర్వహించిన జిల్లా స్థాయి పరీక్షలో ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన అపస్ టాలెంట్ టెస్ట్ లో కూడా నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచిన కే.మోహన్, నరేంద్రకు రూ.10వేలు రూపాయలను షీల్డ్, మెడల్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పులిమి వెంకటరమేష్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ పై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు సోమవారం స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సంధర్భంగా మూలవర్లకు అబిషేకం, తిరుప్పావడ సేవ కార్యక్ర మాలు వేద పండితుల మంత్రో చ్చారణల మధ్య వైభవంగా జరిగాయి. ఈ పూజా కార్యక్రమాలలో కార్య నిర్వహణాధికారి వి.గిరికృష్ణ, అర్చక సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతానికి గురై గేదెలు మృతి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గేదలు విద్యుత్ ఘాతానికి గురై ఒక గేదె, మూడు దూడలు మృతి చెందిన సంఘటన సోమవారం ఆల్యసంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కలమకూరి మల్లేశ్వరి, శ్రీనివాసులు, శేషారెడ్డికి చెందిన ఒక గేదె, మూడు దూడలు గత మూడు రోజుల క్రితం ఆటవీ ప్రాంతానికి మేతకెళ్లాయి. మేతకెళ్లిన గేదెలు తిరిగి ఇంటికి రాకపోవడంతో యజమానులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ తరుణంలో సోమవారం దాసరిపల్లి కొండ ప్రాంతంలో గేదెలు మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి గేదెలు మృతిచెందాయని బాధితులు వాపోయారు. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు. పోలీసులకు పిర్యాదు చేస్తామన్నారు.

## ప్రతి రైతు కౌలు కార్డు పొందాలి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని రేబాల, దామరమడుగు గ్రామాలలో కౌలు రైతుల కార్డుల రైతులకు మంజూరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఎం.సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పొలం కౌలు చేసుకునే ప్రతి రైతు ఆయా గ్రామాలలోని విఆర్ఓని సంప్రదించి కౌలు కార్డులు పొందవలసిందిగా వారికి తెలియజేయడం జరిగింది. తద్వారా వారు ప్రభుత్వం అందించే వివిధ పదకాలకు అర్హులుగా అవడం జరుగుతుంది. ప్రతి రైతు కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయం పొందుటకు ఆధార్ కార్డు, పాస్ పుస్తకం, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంటు పుస్తకం, మొబైల్ నెంబర్‌ను సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారులకు ఇచ్చి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన కలెక్టరును కలిసిన మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఓ.ఆనంద్‌ను నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ వారి కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం సమర్పించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మా బతుకుల్లో బురద.. ఆదుకునే వారెవరు

## రెవిన్యూ శాఖకు వినతిపత్రం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మా బతుకులు బురద మయంగా ఉన్నాయి. చేపలు రొయ్యలు, పీతలు ఉండేటువంటి ఏటి కాలువ నందు బురద ప్రవాహం ఎక్కువగా ఉందని దీంతో జీవనం కోల్పోయామని ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ముత్తుకూరు గ్రామపంచాయతీ చలివేంద్రం గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. సోమవారం సుమారు 20 కుటుంబాలు రెవిన్యూ శాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈ అర్జీలో గిరిజన కుటుంబాలు ఆవేదన చూపాయి. 100 శాతం విరిగిన కుటుంబాలు ఈ కాలపు ఆధారంగా చేపలు పట్టుకొని జీవనం సాగించే వారని బురద నీరు రావడం వల్ల జీవనం కోల్పోయామని ఆవేదన చూపారు. గత 15 సంవత్సరాలుగా అధికారులకు మొరపెట్టుకుంటున్న పట్టించుకోవట్లేదని అన్నారు. న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ కోరారు. అనంతరం తాసిల్దార్ బాలకృష్ణారెడ్డి వినతిపత్రాన్ని పరిశీలించి సమాధానం చెప్పారు. విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదాన వితరణ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగంలో సోమవారం చక్రాల వారి ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బాలాజీ నగర్ చివర వేపదరువు సమీపంలో గల గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదాన వితరణ కార్యక్రమం ట్రస్ట్ ధర్మకర్తలు ఆదిశంకర ధ్యాన మందిర సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ స్వామి సమయానందనాథ తమ ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా గత సంవత్సరం ఆత్మకూరు బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించామని సోమవారం గీతామయి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన వితరణ కావించామని దాదాపు 100 మంది వృద్ధులు విద్యార్థులు అన్నప్రసాద స్వీకరణ కావించారని తెలిపారు. మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. ఈనాటి ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణతో పాటు గీతామయి బాలల ఆశ్రమం విద్యార్థులకు నోటు పుస్తకాలు కలములు మొదలైన వాటిని కూడా అందజేశామని తెలిపారు. గత 15సంవత్సరాలుగా ట్రస్టు తరుపున పేద విద్యార్థులకు వృద్ధాశ్రమం పేద బ్రాహ్మణ వివాహములకు ఉపనయనములకు వైద్య పరంగా ఆర్థిక సహాయములు అందిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం 22మంది విద్యార్థులకు కాళహస్తి వృద్ధాశ్రమంకు వైద్య పరంగా ఇద్దరికీ పదివేల రూపాయలు చొప్పున మొత్తం 2 లక్షల 50 వేల రూపాయలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం గావించిన ధర్మకర్తలకు ధ్యానమందిర సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చట అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేసి మాకు సహకరించిన గీతామయి వృద్ధాశ్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు శ్రీపార గురు వెంకట శ్రీధర శర్మ, అన్నవరం సత్యనారాయణ, గన్నవరం ప్రభాకర్ శర్మ, ఒంగోలు సుధాకరశర్మ, రామాయణం మణిశంకర్ శర్మ, ములుముడి ఉదయ్ కుమార్ శర్మ, చక్రాల లక్ష్మీ రమణ మూర్తి, వంక హరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు స్వయంగా అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పుస్తక బహుకరణ కార్యక్రమం నిర్వహించారు. ధ్యాన మందిర అధ్యక్షులు శ్రీ పార గురు వెంకట శ్రీధర్ శర్మ, వందన సమర్పణ కావించి అందరికీ శుభాభినందనలు తెలియజేశారు.

# విద్యార్థులను పరామర్శించిన జనసేన నాయకులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నాయుడుపేట, ఎల్‌ఏ సాగర్ నందు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహ్వారం తిని అస్వస్థకు గురైన 89 మంది విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఎనిమిది మంది విద్యార్థులను ఆరోగ్య పరిస్థితిని గూర్చి జనసేన నాయకుడు గునుకుల కిషోర్ పరామర్శించారు. వచ్చినప్పుడు కంటే ఇప్పుడు వారి పరిస్థితి మెరుగుగా ఉందని 3పిల్లలను జనరల్ వార్డ్ కి షిఫ్ట్ చేశామని, ఈ ఐదు మంది కూడా ఇప్పుడు పర్వా లేదని, 24 గంటలు గడిచిన తర్వాత మీరు ఆరోగ్య స్థితిని వెల్లడించగలమని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి పిల్లలు అనారోగ్యానికి కారణమైన వారిని సస్పెండ్ చేయాలని కోరారు. మరలా ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల తీసుకోవాలి. ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో గురుకుల పాఠశాలలంతా కూడా పర్యవేక్షణ లోపంతో ఇబ్బంది పడుతున్నాయి. ప్రజా ప్రభుత్వ నాయకులందరూ కూడా వాటిని పరిశీలించి ఆహారం, వసతి విద్యా సౌకర్యాలను మెరుపరచేందుకు ప్రయత్నించాలని కోరారు.

# ఆలయ నిర్మాణానికి సహకరించండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఆనకట్ట సమీపంలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు తహసీల్దారు నెహ్రూబాబుకు విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమ పెద్దల కాలం నుంచి ఆనకట్ట సమీపంలో ఉన్న గంగమ్మ ఆలయం వద్ద ఏడాదికోసారి ఉత్సవాలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టడం ఆనవాయితీ అన్నారు. గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరడంతో గతేడాది దాతల సహకారంతో నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. అయితే ఇటీవల అధికారులు ఆలయ నిర్మాణ స్థలం పర్యాటక శాఖకు చెందిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, ఆలయ కమిటీ సభ్యులు బొజ్జా నరసింహులు, శ్రీనివాసులు, పెదవెంకటయ్య, మేస్త్రీ వెంకటేశ్వర్లు, నాగయ్య, కాంతారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సోమశిలలో ఘనంగా పీర్ల ఊరేగింపు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలంలో మొహరం మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని పలు దర్గాలను విద్యుత్ దీప కాంతులతో అందంగా అలంకరించారు. సోమశిలలో హజరత్ బాదుల్లా సాహెబ్ మస్తాన్ వలి పీర్లను దర్గా వరకు ఊరేగింపుతో తీసుకువెళ్లి ప్రతిష్టించారు. బుధవారం వరకు మొహరం మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాకులు సయ్యద్ అబ్దుల్ రెహమాన్, షేక్ మస్తాన్ వలి తెలిపారు. భక్తులు దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# అయ్యగార్లు అప్పుడప్పుడు రండి సార్లు..



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయాన్ని రాష్ట్ర మంత్రులు ఆదివారం సందర్శించిన విషయం విధితమే. అయితే పెద్దలు రాక నేపథ్యంలో కొన్ని సంవత్సరాలపాటు దుర్భరంగా ఉన్న ప్రాజెక్టు, గ్రామ, రహదారి పరిసర ప్రాంతాలు శుభ్రం అయ్యాయి. ప్రధాన రహదారికి ఇరు ప్రక్కల దట్టంగా పెరిగి రోడ్డుపైకి చొచ్చుకు వచ్చిన కంప చెట్లు తొలగించారు. ప్రాజెక్టు వద్ద వ్యర్థాలను, చెత్త చెదారంను, పిచ్చి మొక్కలను పంచాయితీ, ప్రాజెక్ట్ అధికారులు ఆగ మేఘాలపై శుభ్రం చేశారు. అధ్వాన పరిస్థితులను సరి చేయాలి అంటూ ఎన్ని విన్నపాలు పంచాయితీకి, ప్రాజెక్టు అధికారులకు గతంలో విన్నవించినా గుప్పెడు బ్లీచింగ్ చల్లేందుకు, సున్నం కొట్టేందుకే నిధులు లేవంటూ విసుగుగా సమాధానం చెప్పే యంత్రాంగం మంత్రి గార్లు వస్తున్నారని పరిసరాల రూపురేఖలే మార్చడం, సుందరంగా తీర్చిదిద్దడం పట్ల గ్రామస్తులు విస్మయానికి గురవుతున్నారు. అయ్యగార్లు అప్పుడప్పుడు వచ్చి వెళ్ళండి సార్లు అంటూ చమత్కరిస్తున్నారు.